



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
మంగళవారం
29-07-2025
పేజీలు: 02



# చెస్ క్వీన్ దివ్య



ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన యువ సంచలనం దివ్య దేశ్‌ముఖ్ విజేతగా నిలిచింది. భారత్‌కే చెందిన తెలుగుతేజం కోనేరు హంపితో జరిగిన ఫైనల్లో దివ్య 1.5, 0.5 పాయింట్ల తేడాతో జయకేతనం ఎగుర వేసింది. సోమవారం టైబ్రేకర్‌లో దివ్య జయభేరి మోగించింది. ఇద్దరి మధ్య జరిగిన తొలి రెండు రౌండ్‌లు డ్రాగా ముగిసాయి. దీంతో ఫలితం కోసం టైబ్రేకర్ అనివార్యమైంది. ఇందులో అసాధారణ ఆటను కనబరిచిన మహారాష్ట్ర సంచలనం దివ్య చారిత్రక విజయాన్ని అందుకుంది. తొలి ర్యాపిడ్ టై బ్రేకర్ డ్రాగా ముగియగా, రెండో టైబ్రేకర్‌లో దివ్య 75 ఎత్తుల్లో సీనియర్ క్రీడాకారిణి కోనేరు హంపిని ఓడించింది. భారత్ మహిళల ఫిడే ప్రపంచ చెస్ టైటిల్‌ను గెలువడం ఇదే తొలిసారి కావడం విశేషం. కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్‌లు ఫైనల్‌కు చేరడంతో భారత్‌కు ప్రపంచ చెస్ కిరీటం ముందే ఖాయమైంది. అయితే ఫైనల్లో చిరస్మరణీయ ప్రతిభను కనబరిచిన మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నగరానికి చెందిన 19 ఏళ్ల దివ్య జార్జియా వేదికగా జరిగిన ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో అసాధారణ ఆటతో విశ్వవిజేతగా నిలిచింది. మరోవైపు ఫైనల్లో గెలిచి టైటిల్ సాధించాలని భావించిన భారత చెస్ స్టార్ హంపికి నిరాశే మిగిలింది. తుది పోరులో హంపి అసాధారణ ఆటను కనబరిచినా ఫలితం లేకుండా పోయింది. చివరి వరకు నిలకడైన ఆటతో అలరించిన దివ్య ప్రపంచ టైటిల్‌ను సొంతం చేసుకుంది. బాటుమిలో జరిగిన మహిళల చెస్ ప్రపంచ కప్‌లో దివ్య ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగింది. ఈ టోర్నమెంట్‌కు ముందు దివ్య సీనియర్ విభాగంలో ఆడిన టోర్నీలు కూడా తక్కువే. అంతేగాక టోర్నీ ఫైనల్స్‌కు ముందు దివ్యకు గ్రాండ్ మాస్టర్ హోదా కూడా లేదు. మాస్టర్ హోదాతోనే దివ్యవిశ్వకప్ బరిలోకి దిగింది. ఈ పరిస్థితుల్లో దివ్య విశ్వవిజేతగా నిలుస్తుందని ఎవరూ ఊహించలేదు. హంపితో సహా ప్రపంచంలోని దిగ్గజ గ్రాండ్ మాస్టర్లు బరిలో ఉండడంతో వీరిలో ఎవరో ఒకరు టైటిల్ సాధిస్తారని అందరూ ఊహించారు. కానీ అందరి అంచనాలను తారుమారు చేస్తూ భారత్‌కు చెందిన యువ చెస్ క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్ విశ్వవిజేతగా నిలవడం విశేషం. ప్రపంచ చెస్ టైటిల్‌తో దివ్య సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇంతకుముందు ప్రపంచ మహిళల చెస్‌లో భారత్ ఒక్కసారి కూడా ఫైనల్‌కు చేరలేదు. ఈ టోర్నీలో దివ్య ఫైనల్‌కు చేరి ఈ ఘనత సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా సరికొత్త రికార్డు నెలకొల్పింది. హంపి కూడా సెమీస్‌లో గెలిచి దివ్య సరసన నిలిచింది. తాజాగా ఫైనల్లో దివ్య తన కంటే ఎంతో సీనియర్ అయిన హంపిని మట్టికరిపించి ఔరా అనిపించింది.



## 11ఏళ్లుగా హిట్ లేకున్నా క్రేజ్‌లో తగ్గేదేలే

ఆ అమ్మాయి చదువులో బ్రిలియంట్. స్కూల్‌లో ఉత్తమ విద్యార్థి. ఇంటర్మీడియెట్‌లోనూ క్లాస్ టాపర్. ఫేమస్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేట్ కూడా పూర్తి చేసింది. ఆ తర్వాత ఐఏఎస్ అవ్వాలని లక్ష్యం నిర్దేశించుకుంది. ఈ దిశగా అడుగులు కూడా వేసింది. కానీ, అనుకోకుండా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. అదీనూ టాలీవుడ్‌తోనే తెరంగేట్రం చేసింది. అయితే 11ఏళ్లుగా పెద్ద హిట్ లేకపోయినా, తెలుగు ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్‌గానే కొనసాగుతోంది. ఇంతకీ ఆ హీరోయిన్ ఎవరో కాదు రాశీ ఖన్నాప్రస్తుతం రాశీ ఖన్నా నెక్ట్స్ బిగ్ ప్రాజెక్ట్ 'తెలుసు కదా' పై దృష్టి సారించింది. నీరజా కోన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. అక్టోబర్ 17న ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. రాశీ కెరీర్‌లో ఈ సినిమా కీలక మలుపు కావొచ్చని సినీ వర్గాల్లో చర్చ. సంతోషం, ప్రేమ, బాధ, ధైర్యం అన్నీ కలబోసిన పాత్రను ఇందులో పోషించనుందని సమాచారం. ఈసారి రాశీ ఖన్నా కచ్చితంగా హిట్ కొడతారని అభిమానులు ఆశిస్తున్నారు.



## తెలంగాణ కేబినెట్‌లో కీలక నిర్ణయం.. సర్పంచ్ ఎన్నికలకు బ్రేక్

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర సందిగ్ధత నెలకొంది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ విషయంపై కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇది ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో ఒక ప్రముఖమైన పరిణామంగా కనిపిస్తోంది.

కేంద్ర వైఖరిపై ఢిల్లీలో భారీ ధర్నా..

బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఢిల్లీలో భారీ ధర్నా చేయాలని తెలంగాణ ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో.. ఆగస్టు 5వ తేదీన మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి పయనం కానున్నారు. అక్కడ వారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. అంతేకాకుండా.. బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇండియా కూటమిలోని ఇతర పార్టీల మద్దతును కూడా కోరనున్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర అసెంబ్లీలో ఇప్పటికే ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ బిల్లు ప్రస్తుతం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది. మరోవైపు, రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టు ఇచ్చిన గడువు కూడా పూర్తైంది. ఈ నేపథ్యంలో..


తదుపరి కార్యాచరణ ఎలా ఉండాలనే దానిపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించి ఈ కీలక నిర్ణయం తీసుకుంది. కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ సహా రాష్ట్రంలోని అన్ని పార్టీలలోని బీసీ నాయకులు అందరూ బీసీ రిజర్వేషన్ల కోసం ముందుకు వచ్చి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే అంశంపై ఆగస్టు 5, 6, 7వ తేదీలలో ఢిల్లీలో నిరసన తెలుపుతామని, తమతో కలిసి రావాలని అన్ని పార్టీల బీసీ నాయకులను ఆహ్వానించారు. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా రాష్ట్రంలో కుల గణన చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమైతే, వాటికి అందాల్సిన నిధుల విడుదలలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## తమిళనాడులో చిల్లీ చికెన్ పేరుతో గబ్బిలాల మాంసం



మీరు ఎప్పుడైనా చిల్లీ చికెన్ తిన్నారా.. ఎంత బాగుంటుందో అంటారా.. కానీ, మీరెప్పుడైనా గబ్బిలాలతో తయారు చేసిన చిల్లీ చికెన్ తిన్నారా..

గబ్బిలాలతో తయారు చేసిన చిల్లీ చికెన్‌ను అమ్ముతున్న ఓ దారుణమైన సంఘటన తమిళనాడులో వెలుగులోకి వచ్చింది. సేలం జిల్లా ఓమలూరు సమీపంలోని డానిష్‌పేట అటవీ ప్రాంతంలో గబ్బిలాలను చంపి ఆ తర్వాత వాటిని వండి చిల్లీ చికెన్‌గా అమ్ముతున్నట్లు ఆరోపణలు ఎదుర్కుంటున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పాపం ఇది నిజమైన చికెన్ అనుకుని అక్కడి స్థానిక ప్రజలు తింటున్నారని పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. డానిష్ పేట పరిధిలోని తోప్పూర్ రామస్వామి కొండ ప్రాంతంలో తరచుగా తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయని డానిష్‌పేట అటవీ కార్యాలయానికి సమాచారం అందింది. దీంతో ఫారెస్ట్ రేంజర్ విమల్‌కుమార్ నేతృత్వంలోని అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో గస్తీ నిర్వహించారు.. నిజంగానే అక్కడ తుపాకీ కాల్పుల శబ్దాలు వారికి వినిపించాయి. దీంతో ఏంటని వారు అటవీ ప్రాంతాన్ని మొత్తం గాలించారు. ఈ క్రమంలోనే వారికి కమల్, సెల్వం అనే ఇద్దరు వ్యక్తులు కన్పించారు. వెంటనే అటవీ శాఖ అధికారులు వారి ఇద్దరిని పట్టుకుని తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత వారిని విచారించగా.. వారు ఎలాంటి విషయాలు చెప్పలేదు. కాకపోతే వారిద్దరూ ఓ హోటల్ నిర్వహిస్తూ చికెన్ అమ్ముతున్నారు. దీంతో వారు గబ్బిలాల మాంసంతోనే చికెన్ చేస్తున్నట్లు అనుమానించిన స్థానికులు అదే నిజమై ఉంటుందని పోలీసులకు చెప్పారు. ఇలా పెద్ద ఎత్తున ఆరోపణలు రాగా.. పోలీసులు వారిద్దరినీ అరెస్ట్ చేశారు. అయితే ప్రస్తుతం వారు నోరు మెదపడం లేదని.. తాము ఎలాంటి తప్పు చేయడం లేదని మాత్రమే చెబుతున్నారని పోలీసులు వివరించారు. ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేసిన తర్వాతే అసలు విషయాలు తెలుస్తాయని అంటున్నారు. మరోవైపు ఓమలూరు సమీపంలోని పన్నపట్టి పంచాయతీలోని వవ్వాల్‌తోప్పు ప్రాంతంలో ఒక చెట్టుపై లక్షలాది గబ్బిలాలు నివసిస్తున్నాయని.. వాటిని వేటాడటానికి కూడా వీరిద్దరూ ప్రయత్నించినట్లు ఆ గ్రామస్థులు చెబుతున్నారు. కానీ తాము గబ్బిలాలను దేవతలుగా పూజిస్తున్నందున వాటిని చంపడానికి అనుమతించలేదని.. అందుకే వారు అడవుల్లోకి వేటకు వెళ్లి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



## ప్రపంచానికి ట్రంప్ వార్నింగ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో హెచ్చరిక జారీ చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోని దేశాల నుంచి వచ్చే దిగుమతులపై గంపగుత్తగా 15 నుంచి 20 శాతం మేర సుంకాలు విధిస్తామని అన్నారు. 'ప్రపంచదేశాలకు నేను చెప్పేది ఇదే.. సుంకాలు 15 శాతం నుంచి 20 శాతం వరకూ ఉండొచ్చు' అని ట్రంప్ స్కాట్‌లాండ్‌లో యూకే ప్రధానితో కలిసి పాల్గొన్న మీడియా సమావేశంలో హెచ్చరించారు. గతంలో ట్రంప్ కనీస సుంకాన్ని 10 శాతంగా నిర్ణయించిన విషయం తెలిసిందే. అంతకుముందు కామర్స్ సెక్రెటరీ హోవర్డ్ లట్నిక్ కూడా స్పందిస్తూ చిన్న దేశాలపై 10 శాతం సుంకం మాత్రమే విధిస్తామని పేర్కొన్నారు. లాటిన్ అమెరికా దేశాలు, కరీబియన్ దేశాలు, ఆఫ్రికాలోని పలు ఇతర దేశాలకు పది శాతం సుంకం వర్తిస్తుందని పేర్కొన్నారు. తాజా ప్రకటనలో ట్రంప్ రూటు మార్చారు. వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోని దేశాలన్నిటిపై ఒకే సుంకం విధిస్తామని అన్నారు. తాజా హెచ్చరికతో చిన్న దేశాలపై పెను భారం పడనుంది. కనీస సుంకం 10 శాతంగానే ఉంటుందని అనేక దేశాలు ఆశించాయి. కానీ ట్రంప్ తాజా ప్రకటనతో ఈ ఆశలపై నీళ్లు చల్లినట్టైంది. ట్రంప్ గతంలో ప్రకటించిన డెడ్‌లైన్ ఆగస్టు 1తో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో భారత్ సహా పలు దేశాలు అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయి. డెడ్ లైన్ సమీపిస్తున్నందున ఎక్కువ డీల్స్ చేసుకోవాలన్న ఒత్తిడి తమపై ఏమీ లేదని ట్రంప్ ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.



## పెద్దమ్మతల్లి గుడి స్థలాన్ని పరిశీలించిన బీజేపీ నేతలు

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 లోని ఇటీవల పెద్దమ్మ తల్లి గుడిని అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. సోమవారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత చింతల రామచంద్ర రెడ్డి బీజేపీ శ్రేణులతో కలిసి ఘటన స్థలాన్ని పరిశిలించారు. గుడిని కూల్చివేయడం అనే హిందువుల మనోభావాలను దెబ్బతీయడం అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే అదే స్థలంలో గుడి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## పంత్ స్థానంలో జగదీశన్

అండరన్స్ – టెండూల్కర్ ట్రోఫీలో చివరి టెస్టు రిషభ్ పంత్ దూరమయ్యాడు. మాంచెస్టర్ టెస్టులో కుడి పాదం వేలికి గాయంతో ఇబ్బంది పడిన భారత వైస్ కెప్టెన్ ఓవల్ టెస్టుకు అందుబాటులో ఉండడని బీసీసీఐ తెలిపింది. అతడి స్థానంలో వికెట్ కీపర్ జగదీశన్ ను స్క్వాడ్‌లోకి తీసుకున్నారు సెలెక్టర్లు. ప్రస్తుతం పంత్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. ఈ చిచ్చరపిడుగు త్వరగా కోలుకోవాలని బీసీసీఐతో పాటు అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. భారత్, ఇంగ్లండ్‌ల మధ్య జూలై 31న ఐదో టెస్టు మొదలవ్వనుంది. మాంచెస్టర్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడిన పంత్.. శార్దూల్ ఠాకూర్ ఔటయ్యాక కుంటుతూనే క్రీజులోకి వచ్చాడు. 37 పరుగులతో ఎంటరైన అతడు అర్ధ శతకంతో జట్టును ఆదుకున్నాడు. అయితే.. స్కానింగ్ పరీక్షలో అతడి కుడి పాదం వేలు ఎముక విరిగినట్టు తేలడంతో వైద్యులు విశ్రాంతి అవసరమని సూచించారు.



# ఢిల్లీలో భారీ వర్షాలు

దేశ రాజధాని ఢిల్లీలో ఈరోజు భారీ వర్షం కురుస్తోంది. ఈ ప్రభావం విమాన ప్రయాణాలపై కూడా పడింది. ఈ నేపథ్యంలో పలు విమానయాన సంస్థలు ముందుగానే అప్రమత్తమై ప్రయాణికులకు ప్రయాణ సూచనలు జారీ చేశాయి. దీంతో విమానాల ఆలస్యం, రద్దులు సంభవించే అవకాశం ఉందని తెలియజేశాయి. ఈ క్రమంలో ఎయిర్ ఇండియా తన ప్రయాణికులకు సోషల్ మీడియా ఎక్స్ ద్వారా సమాచారం ఇచ్చింది. ఢిల్లీలో వర్షం కారణంగా విమాన సర్వీసులు ప్రభావితమయ్యే అవకాశముందని తెలిపింది. విమానాశ్రయానికి బయలుదేరేముందు మీ ఫ్లైట్ స్టేటస్ చెక్ చేసుకోవాలని తెలిపింది. ఢిల్లీలో వర్షం కారణంగా మిగతా షెడ్యూల్స్ ఆలస్యం అవుతాయని, సిబ్బంది పరిమితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.ఇండిగో కూడా తన ప్రయాణికులకు వర్షం సంబంధిత హెచ్చరికను జారీ చేసింది. ఢిల్లీలో భారీ వర్షం కారణంగా ట్రాఫిక్ నెమ్మదిగా ఉండే అవకాశం ఉంది. మీ ప్రయాణానికి కొంత అదనపు సమయం కేటాయించండి. మేము మీ ప్రయాణాన్ని భద్రంగా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ క్రమంలో విమానాల ఆలస్యం సహా ఎటువంటి సహాయం అవసరమైనా మేమున్నామని ట్వీట్ చేసింది.

## యువకుడి ప్రాణాలు కాపాడిన...హైడ్రా హీరోలకు కమిషనర్ సన్మానం

దుర్గం చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని చాకచక్యంగా కాపాడిన హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది తిరుపతి యాదవ్, సంతోష్ చారి, మహ్మద్ ఇమ్రాన్‌లను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు అభినందించారు. ఈ నెల 25న రామిరెడ్డి అనే యువకుడు తీగల వంతెన అంచున నిలబడి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించగా.. అక్కడ విధుల్లో ఉన్న డీఆర్ ఎఫ్ సిబ్బంది కాపాడిన విషయం అందరికీ విధితమే. రామిరెడ్డిని మాటల్లో పెట్టి.., దృష్టి మరల్చి.. క్షణాల్లో కాపాడిన తిరుపతి యాదవ్‌ను కమిషనర్ అభినందించారు. అలాగే అక్కడ విధుల్లో ఉండి.. యువకుడిని కాపాడేందుకు సహకరించిన సంతోష్ చారి, మహ్మద్ ఇమ్రాన్‌లను కూడా శాలువ కప్పి సన్మానించారు. దుర్గం చెరువు వంతెనపై నీరు




నిలబడకుండా.. రంద్రాలను శుభ్రం చేస్తున్నప్పుడు ఓ యువకుడు దూకేందుకు యత్నిస్తున్న దృశ్యాలను చూశామని.. ఒకవైపు అతడిని దూకవద్దు అని మాటల్లో పెట్టి... మరో వైపునుంచి వచ్చి కాపాడినట్టు ఆ ముగ్గురు డీఆర్ ఎఫ్ ఉద్యోగులు కమిషనర్‌కు వివరించారు.



## 'కింగ్డమ్' నుంచి 'రగిలే రగిలే' లిరికల్ సాంగ్ విడుదల

టాలీవుడ్ రౌడీ హీరో ది విజయ్ దేవరకొండ హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన అవైటెడ్ చిత్రమే "కింగ్డమ్". అనౌన్స్ చేసిన నాటి నుంచి ఇప్పుడు వరకు మంచి హైప్ ని సెట్ చేసుకున్న ఈ సినిమా నుంచి ఇప్పుడు మరో కొత్త పాట బయటకి వచ్చింది. మ్యూజిక్ సెన్సేషన్ అనిరుద్ స్వరపరిచిన ఈ 'రగిలే రగిలే' సాంగ్ మంచి పవర్ఫుల్ గా గూస్ బంప్స్ ఇచ్చే లెవెల్లో ఉందని చెప్పాలి. లీసెంట్ గానే వైబ్ ఉంది సాంగ్ తో ఇంప్రెస్ చేసిన సాహిత్య రచయిత కృష్ణకాంత్ రచించిన ఈ పవర్ఫుల్ పాట పదునైన పదాలతో ఆకట్టుకుంటుంది. ఇక దీనితో పాటుగా అనిరుద్ మార్క్ క్రేజీ బీట్స్ మరింత హైప్ ఎక్కించేలా ఉన్నాయి. మొత్తానికి మాత్రం ఈ సరికొత్త సాంగ్ థియేటర్స్ లో బ్లాస్టింగ్ ట్రీట్ ఇస్తుంది అని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రాన్ని నాగవంశీ, సాయి సౌజన్యలు నిర్మాణం వహించగా ఈ జూలై 31న గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది.

## సోదరితో స్నేహాన్ని సహించలేక.. పరువు హత్య



తమిళనాడులోని పాళయంకోటలో ఓ యువకుడు పరువు హత్యకు గురయ్యాడు. నిమ్నకులస్థుడైన ఓ యువకుడు అగ్రకులానికి చెందిన తన సోదరితో స్నేహం పెంచుకున్నాడని ఆమె తమ్ముడు నడిరోడ్డులో కత్తితో దాడి చేసి దారుణంగా హతమార్చాడు. ఈ పరువుహత్యకు పాల్పడిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. వివరాలిలా... తూత్తుకుడి జిల్లా ఏరల్ సమీపంలోని ఆరుముగమంగళం ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్, సెల్వి దంపతుల కుమారుడు కవిన్‌కుమార్ (26) చెన్నై ఐటీ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల సెలవులకు స్వస్థలానికి వెళ్ళిన కవిన్‌కుమార్ తన తాతకు అస్వస్థతగా ఉండటంతో ఆదివారం ఉదయం పాళయంకోట కేటీసీ నగర్ ప్రాంతంలో ఉన్న సిద్ధ వైద్య ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆస్పత్రిలో తాతకు చికిత్స జరుగుతుండటంతో కవిన్‌కుమార్ బయట నిలబడ్డాడు. ఆ సమయంలో బైకుపై వచ్చిన ఓ యువకుడు అతడిని పిలిచాడు. కొంత దూరం వెళ్లాక బైకు నిలిపి కవిన్‌కుమార్‌తో ఆ యువకుడు గొడవకు దిగి హఠాత్తుగా కత్తితో దాడి చేసి పారిపోయాడు. కత్తిపోట్లతో కవిన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.

## గ్లామర్ డోస్ పెంచిన రకుల్

కెరటం మూవీతో సిల్వర్ స్క్రీన్‌కు పరిచయమైన బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్. ఈ మూవీతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఇక తర్వాత వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టి, తక్కువ సమయంలోనే తన నటన, గ్లామర్‌తో మంచి గుర్తింపు తెచ్చుకొని వరస సినిమాలతో టాలీవుడ్ నెంబర్ వన్ హీరోయిన్‌గా తన సత్తా చాటింది.వరసగా ఆఫర్స్ అందుకుంటూ.. కరెంట్ తీగ, సరైనోడు, ధృవ, కిక్2 బ్రూస్ లీ, నాన్నకు ప్రేమతో, కాకి,మన్మథుడు 2 ఇలా చాలా సినిమాల్లో స్టార్ హీరోల సరసన నటించి స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. తర్వాత తెలుగులో అవకాశాలు తగ్గడంతో ఈ బ్యూటీ బాలీవుడ్ చెక్కేసింది.అక్కడ కూడా ఈ అందాల ముద్దుగుమ్మ తన గ్లామర్‌తో మంచి ఫేమ్ సంపాదించుకుంది. అంతే కాకుండా బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నాని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఇక పెళ్లి తర్వాత ఓ వైపు సినిమాలు, మరో వైపు బిజినెస్‌లు చూసుకుంటూ, ఎప్పుడూ బిజీ బిజీగా గడిపేస్తూ ఉంటుంది ఈ బ్యూటీ. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది ఎప్పటికప్పుడు తన వరస ఫొటో షూట్‌తో నెట్టింట సందడి చేస్తుంటుంది. ఇక పెళ్లి తర్వాత గ్లామర్ డోస్ పెంచిన ఈ ముద్దుగుమ్మ, తాజాగా తన ఇన్ స్టాలో అదిరిపోయే ఫొటోస్ షేర్ చేసింది. అందులో ట్రెండీ డ్రెస్‌లో రకుల్ అదిరిపోయిందనే చెప్పాలి.



## టీసీఎస్ ఉద్యోగాలపై కలకలం.. రంగంలోకి కేంద్ర ప్రభుత్వం!

టీసీఎస్‌లో ఉద్యోగాల కోత పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం గమనిస్తోంది. సంబంధిత వర్గాల ప్రకారం ఈ విషయంపై ప్రభుత్వం కంపెనీతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. ఇటీవల టీసీఎస్ సీఈఓ కె. కృతివాసన్ భారీ స్థాయిలో ఉద్యోగాల కోతకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. దాదాపు 12 వేల మందికి పైగా ఉద్యోగాలను తొలగించే యోచనలో కంపెనీ ఉందని సమాచారం.ఉపాధి సృష్టి కేంద్ర ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన అంశంగా ఉంది. ఉద్యోగ అవకాశాలు పెంచే చర్యలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఉద్యోగ ఆధారిత ప్రోత్సాహకాలు, నైపుణ్య శిక్షణ, పునఃనైపుణ్య శిక్షణ వంటి కార్యక్రమాలను మరింతగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటోంది.ఈ మొత్తం పరిస్థితిని ఐటీ మంత్రిత్వ శాఖ నిశితంగా పరిశీలిస్తోందని, టెక్ కంపెనీతో సంప్రదింపులు జరుపుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి.తొలగింపులపైమంత్రిత్వ శాఖ ఆందోళన చెందుతోంది. ఇది ఎందుకు జరుగుతోంది.. అంతర్లీన కారణాలను అర్థం చేసుకోవడానికి పరిశీలిస్తుంది.భారతదేశపు అతిపెద్ద ఐటీ సేవల సంస్థ అయినటీసీఎస్ ఈ సంవత్సరం 12,261 మంది ఉద్యోగులను తొలగించనున్న నేపథ్యంలో ఈ వైఖరి ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ ప్రభావం ఎక్కువగా మిడిల్, సీనియర్ గ్రేడ్‌ఉద్యోగులపై పడుతుంది.2025 జూన్ 30 నాటికి టీసీఎస్




ఉద్యోగుల సంఖ్య 6,13,069గా ఉంది. ఇటీవల ముగిసిన ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 5,000 మంది ఉద్యోగులు జతయ్యారు.